సాక్షి
మహబూబాబాద్
శుక్రవారం । 21 । జూన్ । 2024



కాపలా.. కరువైంది!
టీజీ ఎన్పీడీసీఎల్‌లో వాచ్‌మెన్, స్వీపర్ పోస్టులను ఇంకా విభజన చేయడం లేదు. ఫలితంగా కార్యాలయాలకు కాపలా, శుభ్రత కరువైంది. - 8లో▸



ఎన్‌సీసీ అకాడమీ ఏర్పాటుకు కృషి
ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎన్‌సీసీ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమొడోర్ వి.ఎం.రెడ్డి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/26^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



కురవి: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. గురువారం మండలంలోని రాజోలు శివారు హరిదాసు తండా జీపీ పరిధిలోని బాలు తండాలో డెస్టినీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిషన్ రాజ్‌పుత్ అందించిన నోట్ బుక్స్, స్కూల్ బ్యాగులను విప్, రాంచంద్రునాయక్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయ డం అభినందనీయమన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం, నాయకులు బండి శ్రీనివాస్, మారగాని వీరభద్రం, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాల తనిఖీ

నర్సింహులపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను కేజీబీవీ జిల్లా అధికారిని విజయకుమారి గురువారం తనిఖీ చేశారు. హాస్టల్, పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. బాలికలకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ప్రైవేట్‌కు ధీటుగా బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి



గూడూరు: ఎరువులు, పురుగు మందుల విక్రయ దుకాణదారులు ఎమ్మార్పీకే విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి అభిమన్యు అన్నారు. మండలంలోని మన గ్రోమోర్, లక్ష్మీ, శ్రీరామ ఫర్టిలైజర్స్, పీఏసీఎస్ మేచరాజుపల్లి షాపులను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో నిల్వలను, రిజిస్టర్లను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు.

గిరిజన భవన్‌లో యోగా శిక్షణ

నెహ్రూసెంటర్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఉదయం 7 గంటలకు తొర్రూర్ సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాల, బాలికల పాఠశాలలో నేడు యోగా శిక్షణ నిర్వహిస్తున్నామని ఆయుష్ జిల్లా ఇంచార్జ్ డాక్టర్ నిరంజని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 రోజుల పాటు బాలికలకు యోగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఈ ఏడాది యోగా దినోత్సవం థీమ్‌గా యోగా ద్వారా మహిళా సాధికారత, ఆరోగ్యకరమైన కుటుంబానికి, ఆరోగ్యకరమైన సమాజానికి మహిళల ఆరోగ్యం ముఖ్యమన్నారు.

ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి



నెహ్రూసెంటర్: రాష్ట్రంలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పర్వత కోటేష్, హెచ్.లింగన్న డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో కార్మిక వర్గ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కార్మికులకు కనీస వేతన చట్టాలను అమలు చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎండీ జబ్బార్, తెల్లబోయిన లక్ష్మయ్య, కృష్ణ, అల్లి యాకాంబ్రం, వేణు, రాము, సైదులు, పట్టాబి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తొర్రూరు: తొర్రూరు ఆర్టీసీ డిపో పరిధిలో సమస్యల పరిష్కారానికి నేడు (శుక్రవారం) డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం పద్మావతి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు చేయవచ్చన్నారు. ఆసక్తి గల వారు 9959226053 నంబర్‌కు నిర్ణీత సమయంలో ఫోన్ చేయాలన్నారు.

చిగురిస్తున్న ఆశలు!

డీఎస్సీ రాసే అభ్యర్థులకు పెరగనున్న పోస్టుల సంఖ్య
- జిల్లాలో 517 మందికి ఎస్‌ఏలుగా పదోన్నతి
- హుటాహుటిన విధుల్లో చేరిన ఉపాధ్యాయులు



స్కూల్ అసిస్టెంట్‌గా జాయినింగ్ ఆర్డర్ ఇస్తున్న ఉపాధ్యాయుడు

సాక్షి, మహబూబాబాద్: సెకండ్ గ్రేడ్ టీచర్‌లను స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. దీంతో జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఎస్జీటీ ఖాళీలకు రెట్టింపు ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రభుత్వం ఇటీవల డీఎస్సీ ప్రకటించిన నేపథ్యంలో పోస్టుల భర్తీ నాటికి ప్రస్తుతం ఏర్పడిన ఖాళీలు కూడా కలుపుకుని భర్తీ చేస్తారా? అని డీఎస్సీ రాసే అభ్యర్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

అన్ని పాఠశాలల్లో పోస్టులు భర్తీ చేస్తే మారుమూల గిరిజన తండాలు, ఆదివాసీ గూడేల్లో ప్రభుత్వ విద్య అందుబాటులోకి రానుండటం, బోధన మెరుగవడంతో పాటు బీఎడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉంటుంది.

ఊహించని విధంగా పదోన్నతులు

సీనియార్టీ జాబితాలో ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయులు పదోన్నతి వస్తుందని ముందుగానే ఊహించినా.. కొంత మందికి మాత్రం ఊహించని విధంగా పదోన్నతులు వచ్చినట్లు ఉపాధ్యాయుల్లో చర్చ. స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి వస్తే ఇంగ్లిష్ మీడియంలో బోధించాలి. సర్వీస్ దగ్గర పడిన వారు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని మరికొందరు.. ఇలా ప్రమోషన్ తీసుకోకుండా వెనకడుగు వేశారు. దీంతో సీనియార్టీ జాబితాలో వెనకబడి ఉన్న వారికి కూడా పదోన్నతి వచ్చింది. ప్రధానంగా బయాలజీ, సోషల్ సబ్జెక్టుల విషయంలో తమకు ప్రమోషన్ వస్తుందని ఊహించలేదని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పెరిగిన ఎస్జీటీ పోస్టులు

విద్యాశాఖలో చాలా కాలం తర్వాత ఎస్జీటీలను ఎస్‌ఏలుగా ప్రమోషన్ చేయడంతో జిల్లాలోని ఎస్జీటీల ఖాళీల సంఖ్య పెరిగింది. జిల్లాలో 2,057 ఎస్జీటీ పోస్టులు ఉండగా.. ప్రభుత్వ ప్రకటించిన డీఎస్సీలో 263 ఖాళీలు చూపించారు. అయితే ఇప్పుడు కొత్తగా 517 మంది ఎస్జీటీలకు పదోన్నతి వచ్చింది. ఇందులో 231 మంది స్కూల్ అసిస్టెంట్లుగా, 73 మంది పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందారు. దీంతో జిల్లాలో ఎస్జీటీల ఖాళీల సంఖ్య 567కు చేరే అవకాశం ఉంది. అయితే ప్రభుత్వం ముందుగా ప్రకటించిన విధంగా కాకుండా ప్రస్తుతం ఉన్న ఖాళీల సంఖ్యను పరిగణంలోకి తీసుకొని భర్తీ చేయాలని డీఎస్సీ రాసే అభ్యర్థులు కోరుతున్నారు.

ఇక ఎస్జీటీల బదిలీ..

ముందుగా పీజీ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, పీఎస్‌హెచ్‌ఎంల పదోన్నతి ప్రక్రియ పూర్తి కావడంతో ఇక మిగిలింది సెకండరీ గ్రేడ్ టీచర్ల పదోన్నతి ప్రక్రియ. ప్రభుత్వం ముందుగా చెప్పిన విధంగా సెప్టెంబర్ 2023 వరకు 8 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన వారు తప్పకుండా బదిలీ కావాలి. అదే విధంగా రెండు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన వారు వారి ఇష్టాన్ని బట్టి బదిలీ కావచ్చు. అప్పుడు జిల్లా వ్యాప్తంగా 3 వేలకు పైగా ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. తర్వాత పదోన్నతులు వచ్చిన వారికి స్థాన చలనం అయింది. ఇప్పుడు తిరిగి 2024 జూన్ ఒకటవ తేదీ వరకు రెండు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన వారు, అదే విధంగా 8 సంవత్సరాలు పూర్తి చేసిన వారు తప్పనిసరిగా బదిలీ కావాలి. ఇలా పాత వారితోపాటు, కొత్తగా అవకాశం వచ్చిన వారు. తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారు బదిలీల ప్రక్రియ కోసం చూస్తున్నారు.

రెండు క్రీడా అకాడమీలు

ఉత్తర్వులు జారీ చేసిన 'సాట్'
- హనుమకొండలో రెజ్లింగ్, స్విమ్మింగ్ అకాడమీల మంజూరు
- ఇప్పటికే ఉన్న అకాడమీల్లో క్రీడాకారుల కుదింపు?
- పదేళ్ల క్రితం తరలిన స్విమ్మింగ్ అకాడమీ తిరిగి ఏర్పాటు
- వచ్చే నెల 3,4 తేదీల్లో అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు
- అన్ని జిల్లాల క్రీడాకారులు పాల్గొనవచ్చన్న డీవైఎస్‌ఓ





వరంగల్ స్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లా క్రీడాకారులకు శుభవార్త ప్రకటించింది. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో మూడు క్రీడల అకాడమీలు కొనసాగుతున్నాయి. వీటికి తోడుగా మరో రెండు క్రీడలను కొనసాగించేలా కొత్త అకాడమీలకు అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ గురువారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. నూతనంగా మంజూరైన అకాడమీల్లో క్రీడాకారుల ప్రవేశాల ఎంపిక ప్రక్రియను సైతం చేపట్టనుంది. ఇందులో అన్ని జిల్లాల క్రీడాకారులు పాల్గొనవచ్చు. హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధీనంలో జేఎన్ స్టేడియంలో ప్రస్తుతం అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్ బాల్ అకాడమీలు కొనసాగుతున్నాయి. క్రీడాకారులు స్టేడియంలోని వసతిగృహంలో ఉంటూ డీఎస్‌ఏ కోచ్‌ల పర్యవేక్షణలో ఆయా క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. తాజాగా ప్రభుత్వం రెజ్లింగ్, స్విమ్మింగ్ అకాడమీలను మంజూరు చేస్తూ సర్క్యులర్ జారీ చేసింది. దీంతో ఆ రెండు క్రీడల క్రీడాకారులు డీఎస్‌ఏ నిర్వహించే ఎంపికలో పాల్గొని అర్హత సాధించినట్లయితే అకాడమీలో శిక్షణ పొందుతారు.

ప్రస్తుతం 118మంది క్రీడాకారులు..

స్టేడియంలోని రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ఇప్పటివరకు ఉన్న మూడు క్రీడల్లో 118 మంది క్రీడాకారులకు వసతి కల్పిస్తోంది. అందులో జిమ్నాస్టిక్స్‌లో బాలురు–30,బాలికలు 20,హ్యాండ్‌బాల్‌లో 16మంది బాలురు, అథ్లెటిక్స్‌లో బాలురు 27 మంది, 25 మంది బాలికలు అడ్మిషన్లు తీసుకునేలా నిబంధనలు ఉన్నాయి. తాజాగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం క్రీడాకారుల సంఖ్య 118 మంది దాటకుండా కొత్తగా మంజూరైన రెండు అకాడమీలు, ఇప్పటికే కొనసాగుతున్న మూడు క్రీడలకు క్రీడాకారులకు అడ్మిషన్లు కల్పించాలని పేర్కొంది. అందులో జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్ క్రీడాకారులకు కోత విధించి రెజ్లింగ్‌లో బాలురు 17 మంది, స్విమ్మింగ్‌లో బాలబాలికలు 18 మంది క్రీడాకారులకు అడ్మిషన్లు కల్పించాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. కాగా, పదేళ్ల క్రితం వరంగల్ రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో స్విమ్మింగ్ అకాడమీ కొనసాగింది. అనుకున్న స్థాయిలో అడ్మిషన్లు, ఆశించిన ఫలితాలు లేకపోవడంతో అకాడమీని ఇక్కడినుంచి తరలించారు. పదేళ్ల తర్వాత జిల్లాకు స్విమ్మింగ్, రెజ్లింగ్ అకాడమీలు మంజూరు కావడం విశేషం.

ఎంపికలో పాల్గొనాలి..

వచ్చే నెల 3,4 తేదీల్లో వరంగల్ రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలకు క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డీవైఎస్‌ఓ జీ.అశోక్ తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించే ఎంపికలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. 12 నుంచి 16 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన బాలురు రెజ్లింగ్ ఎంపికలో పాల్గొనవచ్చన్నారు. రెండు రోజులపాటు జరిగే ఎంపికలు ఉదయం 9గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, స్పోర్ట్స్ సర్టిఫికెట్లు, మెడికల్ సర్టిఫికెట్లు ఒక జిరాక్స్ సెట్‌తోపాటు స్పోర్ట్స్ డ్రెస్, రన్నింగ్ షూతో రావాలని డీఎస్‌ఏ రెజ్లింగ్ కోచ్ రాజు తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు.

నులిపురుగులను నివారిద్దాం

- జిల్లా వైద్యశాఖ అధికారి కళావతి



విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న కళావతి

మహబూబాబాద్ అర్బన్: ఆరోగ్యవంతమైన పిల్లల భవిష్యత్‌కు నులిపురుగులను నివారిద్దామని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ బి.కళావతి అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థిలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళావతి మాట్లాడుతూ సంవత్సరం పిల్లల నుంచి మొదలుకొని 19 సంవత్సరాలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేయాలన్నారు. ఈ మాత్రలు పిల్లల ఎదుగుదలకు దోహదం చేస్తాయని, జిల్లాలో సుమారు 1,74,240 మంది పిల్లలకు మాత్రలను అందిస్తామన్నారు. నేటి నుంచి ఈ నెల 27వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ నపాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలో మాత్రలు అందుబాటులో ఉంటాయని, ఏడాదికి రెండు సార్లు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తామన్నారు. అనంతరం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అంబాల అంబరీష, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి వరలక్ష్మి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణార్జున, డీపీహెచ్‌ఎన్‌ఓ మంగమ్మ, కె.వి రాజు, పురుషోత్తం, హెల్త్ ఎడుకేటర్‌లు సబ్‌యూనిట్ ఆఫీసర్లు వడ్డెబోయిన శ్రీనివాస్, ఒబిలిశెట్టి రామకృష్ణ, దీపిక, హెచ్‌ఎం ఆరుద్ర వెంకటేశ్వర్లు, ఆరోగ్య కర్త అరుణ, రాజేందర్, రేణుక, పద్మ, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ అసిస్టెంట్ సస్పెన్షన్

మహబూబాబాద్ అర్బన్: ఆర్టీఏలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న డేటా ఎంట్రీ అసిస్టెంట్ సురేష్ విధుల్లో నిర్లక్ష్యంగా మద్యం తాగుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో సదరు ఉద్యోగి సురేష్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ కమిషన్ బుద్ధ ప్రకాశ్‌జ్యోతి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సదరు ఉద్యోగి వివిధ సంస్థలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహించకుండా బ్లాక్ లిస్ట్‌లో ఉంచడంతో పాటు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి కృషి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్‌నాయక్



దరఖాస్తులు అందజేసేందుకు వచ్చిన బాధితులు

నెహ్రూసెంటర్: షెడ్యూల్డ్ తెగల సాంఘిక ఆర్థిక అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధ్యక్షతన అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ తెగల హక్కుల పరిరక్షణకై అధికారులు కృషి చేయాలని, సాంఘిక, ఆర్థిక అభివృద్ధికి వివిధ ప్రణాళికల రూపకల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సక్రమంగా అందే విధంగా చూడాలన్నారు. కమిషన్‌కు ఏదైన కేసును విచారించే విషయంలో సివిల్ కోర్టుకు ఉండే అధికారాలు ఉంటాయని ఏ చిన్న సమస్య వచ్చిన నిర్లక్ష్యం చేయరాదన్నారు. పలు మండలాల నుంచి వచ్చిన బాధితుల వివరాలు అడిగి తెలుసుకుని వినతులను స్వీకరించారు. బాధితులు వెల్లడించిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్‌కు సూచించారు. అంతకు ప్రభుత్వ మెడికల్ కళాశాల, పోస్టల్ కార్యాలయాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య, మహబూబాబాద్, తొర్రూర్ ఆర్డీఓలు అలివేలు, నర్సింహారావు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ ఎర్రయ్య, డీఎంహెచ్ఓ డాక్టర్ కళావతిబాయి, ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అంబరీష, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వినతుల వెల్లువ..

మహబూబాబాద్ జిల్లాకు వచ్చిన ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ వినతులు అందించేందుకు వివిధ మండలాల నుంచి బాధితులు వచ్చారు. భూ సమస్యలు, పట్టాల సమస్య, గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు, గిరిజన చట్టాల అమలుపై సమస్యలను కమిషన్ సభ్యుల ఎదుట ఏకరువుపెట్టారు.

జీఓ నంబర్ 3ను పునరుద్ధరించాలి

ఏజెన్సీ ప్రాంతాల్లో జీఓ నంబర్ 3ను అమలు చేసి వంద శాతం నియామకాలు ఏజెన్సీ గిరిజనులతో చేపట్టాలని, రాష్ట్రంలో గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ రోస్టర్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలి. ఏజెన్సీ చట్టాలను పరిరక్షించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు కమిషన్ సభ్యులు హుస్సేన్‌నాయకు వినతిపత్రాన్ని భద్రునాయక్, ధర్మానాయక్, రవీందర్, లచ్చిరాంనాయక్, బాల్యానాయక్, శ్రీనివాస్‌నాయక్ అందజేశారు.

భూపరిహారం చెల్లించాలి

జిల్లా కేంద్రంలో నిర్మించిన మెడికల్ కళాశాలకు గిరిజనుల భూములను ప్రభుత్వం తీసుకుంది. భూములను కోల్పోయిన రైతులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదు. కళాశాల ఏర్పాటు చేసిన తర్వాత జీవనభృతి కల్పిస్తామని అధికారులు చెప్పిన ఇప్పటి వరకు హామీని నెరవేర్చలేదు. కళాశాల కోసం భూములను కోల్పోయిన రైతులను ఆదుకోవాలని మహిళా రైతులు పద్మ, రాధ, అనసూర్య, వినోద వినతిపత్రాన్ని అందజేశారు.

ఆరోగ్యానికి ఆసనం!

- పాఠశాలల్లో యోగా అమలు
- నేడు ప్రపంచ యోగా దినోత్సవం



యోగా సాధన చేస్తున్న బాలికలు

తొర్రూరు: ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి యోగా దోహదపడుతోంది. చిన్నప్పటి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించి సాధన చేయించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలలో యోగా సాధన కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం దీనిని క్రీడాంశంగా గుర్తించి ఒక పాఠ్యాంశంగా చేర్చింది. ఈ మేరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీలతో పాటు వైద్య విద్య, నర్సింగ్ కళాశాలల్లోనూ యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. రెండేళ్లుగా యోగాను అన్ని పాఠశాలల్లో అమలు చేస్తున్నారు.

యోగాకు కొంత సమయం...

ఒకప్పుడు ముఖ్యమైన సందర్భాల్లో మాత్రమే యోగా సాధన చేసేవారు. యోగా దినోత్సవం రోజున లేదా పరీక్షల సమయంలో విద్యార్థుల చేత యోగా చేయించేవారు. ప్రస్తుతం ఆ ధోరణి మారింది. జిల్లాలోని 102 ఉన్నత, 676 ప్రాథమిక, 120 ప్రాథమికోన్నత, 15 కేజీబీవీలు, 8 ఆదర్శ పాఠశాలలు, 6 సంక్షేమ గురుకులాల్లో రోజుకు పది నిమిషాల చొప్పున యోగా సాధన జరుగుతోంది. దీనికి తగ్గట్టుగానే విద్యా క్యాలెండర్‌లో యోగా టైమింగ్ పొందుపర్చారు. యోగా ఆరోగ్యపరంగానే కాదు క్రమశిక్షణ పెంపునకు ఉపయోగపడుతోంది.

యోగాతో ప్రయోజనం

శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠశాలల్లో యోగా నేర్పిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని పాఠశాలల్లో యోగా సాధన కొనసాగుతోంది. యోగా తరగతులు కొనసాగేలా చర్యలు తీసుకుంటాం.
– రామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి

రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలి



సర్టిఫికెట్లు పొందిన వారితో అధికారులు

మహబూబాబాద్ రూరల్: రైతులు పంట సాగు, వ్యవసాయంలో మార్పు, రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు దేశీ శిక్షణ పొందిన ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి అభిమన్యుడు, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి మరియన్న, మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ మాలతి అన్నారు. డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్ టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్పుట్ డీలర్స్ (దేశి) శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు, జ్ఞాపికల ప్రదానోత్సవ కార్యక్రమం జిల్లా కేంద్రంలోని రైతువేదికలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు డీలర్లు సరైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు ఇచ్చి వారు ఆర్థికాభివృద్ధి సాధించేలా చూడాలన్నారు. పంటల సాగులో మెళకువలు తెలుసుకునేలా కృషి చేయాలని, రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించాలంటే దేశీ శిక్షణార్థుల సహకారం తప్పనిసరిగా ఉండాలన్నారు. డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని, దీంతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చన్నారు. క్లాస్ ఫస్ట్ వచ్చిన దూపటి వినయ్ గౌడ్‌కు గోల్డ్ మెడల్ అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేశి ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.నరేందర్ గౌడ్, ఏడీ ఏ లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతిరెడ్డి, ఏఈఓలు సాయిచరణ్, లావణ్య, పావని, మల్యాల కేవీకే శాస్త్రవేత్తలు కిషోర్ కుమార్, రాంబాబు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ హకీంపేటలోని క్రీడాస్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడ యువజన శాఖ అధికారి అనిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల జననం 01–09–2015 నుంచి 31–08–2016 మధ్య జన్మించిన బాల బాలికలకు నాలుగో తరగతిలో ప్రవేశానికి ఎంపికలు ఉంటాయన్నారు. ఈ నెల 21 నుంచి మండల స్థాయి, 29న మహబూబాబాద్‌లో జిల్లా స్థాయి ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా స్థాయిలో ఎంపికలు ఉంటాయన్నారు. మండల, జిల్లా స్థాయి ఎంపికలు విద్యాశాఖ అధికారుల సమక్షంలో నిర్వహిస్తారన్నారు. జిల్లా స్థాయిలో పాల్గొనే బాల బాలికలు తమ వెంట జనన, కుల, నివాసం ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, ఆధార్‌కార్డు, 5 పాస్ ఫొటోలు, జిరాక్స్ సెట్లతో హాజరుకావాలన్నారు.

రేపు మున్సిపల్ సమావేశం

నెహ్రూసెంటర్: ఈ నెల 22న ఉదయం 10.30 గంటలకు మహబూబాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా బిషప్ పట్టాభిషేకం

డోర్నకల్: డోర్నకల్ అధ్యక్ష మండల పీఠాధిపతి రెవ.డాక్టర్ కొడిరెక్క పద్మారావు మూడవ పట్టాభిషేక వేడుకలు బుధవారం ఎఫిఫనీ చర్చిలో ఘనంగా జరిగాయి. బిషప్‌గా బాధ్యతలు స్వీకరించి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎఫిఫనీ చర్చిలో తృతీయ పట్టాభిషేక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ కార్యక్రమానికి హాజరై బిషప్ డాక్టర్ పద్మారావు, స్త్రీల మైత్రి సంఘం అధ్యక్షురాలు విజయకుమారి దంపతులను సన్మానించారు. మూడు సంవత్సరాల పాటు అధ్యక్ష మండల పరిధిలో నిర్వహించిన కార్యక్రమాలను వివరిస్తూ ముద్రించిన పుస్తకాన్ని డాక్టర్ రాంచంద్రునాయక్ ఆవిష్కరించారు. అధ్యక్ష మండల పరిధిలోని ఐదు జిల్లాలకు చెందిన మూడు వేల మందికి పైగా క్రైస్తవులు కార్యక్రమానికి హాజరు కాగా వివిధ చర్చిల పరిధిలోకి కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రోత్సాహక రాయితీ నిధులు విడుదల

మాహబూబాబాద్ రూరల్: జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహక రాయితీ నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి జీనుగు మరియన్న గురువారం తెలిపారు.

రాయితీ నిధులను రైతుల బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేసేందుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా రూ.1621.28 లక్షల నిధులు విడుదల చేశారన్నారు. జిల్లాలో 2022–23 సంవత్సరంలో ఆయిల్ పామ్ సాగు చేసిన రైతులకు రెండో సంవత్సరం ఆయిల్ తోట మెయింటెనెన్స్‌కు సంబంధించి అంతరపంటల సాగు కోసం, తోట యాజమాన్యానికి రూ.158.52 లక్షలు విడుదల అయ్యాయన్నారు. మొత్తం 925 మంది ఆయిల్ పామ్ రైతులకు అంతర పంటల సాగుకు రూ.2,100, ఆయిల్ పామ్ తోట యాజమాన్యం కోసం రూ.2,100 మొత్తం కలిపి రూ.4,200 ఒక ఎకరానికి చొప్పున విడుదల అయ్యాయన్నారు. రాయితీ సొమ్మును సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసే ప్రక్రియ జరుగుతుందని వివరించారు.

క్లుప్తంగా

కాళేశ్వరం పీఎస్‌లో డీఎస్పీ విచారణ

కాళేశ్వరం: కాళేశ్వరం పీఎస్‌లో మహిళా హెడ్‌ కానిస్టేబుల్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో ఎస్సై భవానీసేన్‌ను రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనపై గురువారం భూపాలపల్లి డీఎస్పీ, విచారణాధికారి సంపత్‌రావు.. సీఐ రాజేశ్వర్‌రావుతో కలిసి పీఎస్‌లోని సిబ్బందిని ఒక్కొక్కరిని పిలిచి విచారించారు. ఎస్సై గురించి ఆరా తీశారు. కాగా, ఎస్సైని ఐజీ ఏ.వీ రంగనాథ్‌ సర్వీస్‌ నుంచి తొలగించిన విషయం తెలిసిందే.

ఆర్టీసీ అకౌంట్స్‌ ఆఫీసర్‌ సరెండర్‌

సాక్షి స్పందన

హన్మకొండ: ఆర్టీసీ వరంగల్‌ రీజియన్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌ లావణ్యను యాజమాన్యం ప్రధాన కార్యాలయానికి సరెండర్‌ చేసింది. అకౌంట్స్‌ ఆఫీసర్‌పై పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో యాజమాన్యం చర్యలకు ఉపక్రమించింది. గురువారం 'సాక్షి'లో 'చేతి మరక వదిలిస్తారా' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన యాజమాన్యం అకౌంట్స్‌ ఆఫీసర్‌పై చర్యలు తీసుకుని హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయం బస్‌ భవన్‌కు సరెండర్‌ చేసింది. కరీంనగర్‌ రీజియన్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌ వెంకటేశ్వర్లుకు వరంగల్‌ రీజియన్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. కాగా, ఈ చర్యతో శాఖాపరమైన విచారణ పారదర్శకంగా జరిగేందుకు వీలు కలుగుతుందని పలువురు తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

- 2 క్వింటాళ్ల బెల్లం, 900 లీటర్ల బెల్లం పానకం పట్టివేత
- ముగ్గురిపై కేసు

గార్ల: మండలంలోని పినిరెడ్డిగూడెంలో గురువారం దాడి చేసి 2 క్వింటాళ్ల బెల్లం, 900 లీటర్ల బెల్లంపానకం, 6 లీటర్ల కాపుసారా స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్‌ సీఐ చిరంజీవి వెల్లడించారు. గ్రామానికి చెందిన భూక్య నరేశ్‌, నూనావత్‌ కొండయ్య, కేలోత్‌ శ్రీను గుడుంబా కాచి విక్రయిస్తుండగా ఎక్సైజ్‌ పోలీసులకు పట్టుబడ్డారన్నారు. కాగా, ఈ సందర్భంగా గుడుంబా సేవించడం వల్ల కలిగే అనర్థాలపై సీఐ గ్రామస్తులకు వివరించారు. దాడుల్లో ఎక్సైజ్‌ సీఐలు నాగయ్య, నీరజ, చిరంజీవి, ఎస్సైలు అశోక్‌, చంద్రశేఖర్‌, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాపలా.. కరువైంది!



పూర్తికాని వాచ్‌మెన్‌, స్వీపర్‌ పోస్టుల బైఫర్‌కేషన్‌

- ఫలితంగా రక్షణ, శుభ్రతకు నోచుకోని నూతన విద్యుత్‌ కార్యాలయాలు
- జిల్లాల పునర్విభజనతో టీజీ ఎన్పీడీసీఎల్‌లో పెరిగిన సర్కిళ్లు
- డివిజన్‌, సబ్‌ డివిజన్‌లు, ఈఆర్‌ఓల పునర్విభజన
- ఈ మేరకు పూర్తికాని క్షేత్రస్థాయి పోస్టుల విభజన

హన్మకొండ : సాధారణంగా ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్‌ కార్యాలయంలో కచ్చితంగా వాచ్‌మెన్‌, స్వీపర్‌ను నియమిస్తారు. ఎందుకంటే ఆ కార్యాలయానికి సంబంధించి ఆస్తుల కాపలాకు వాచ్‌మెన్‌, నిరంతరం పరిశుభ్రంగా ఉంచడానికి స్వీపర్‌ ఉంటారు. అయితే రాష్ట్రంలో రెండు విద్యుత్‌ పంపిణీ సంస్థల్లో ఒకటైన టీజీ ఎన్పీడీసీఎల్‌లో మాత్రం ఆ పోస్టులను ఇంకా విభజన చేయడం లేదు. ఫలితంగా ఈ సంస్థ పరిధిలో నూతనంగా ఏర్పాటైన కార్యాలయాలకు కాపలా, శుభ్రత కరువైంది. దీంతో అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

పాలన సౌలభ్యం కోసం నూతన కార్యాలయాలు..

తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనతో పూర్వ వరంగల్‌ జిల్లా (సర్కిల్‌)లో నూతన సర్కిళ్లు, డివిజన్లు, ఈఆర్‌ఓలు, సబ్‌ డివిజన్లు, సెక్షన్‌ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. పాలన సౌలభ్యం కోసం వీటిని ఏర్పాటు చేశారు. ఇంజనీర్లు, ప్రొవెన్షియల్‌, ఆపరేషన్‌ అండ్‌ మెయింటెనెన్స్‌ సిబ్బందిని ఆయా కార్యాలయాలకు సర్దుబాటు చేసి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. స్వీపర్‌, వాచ్‌మెన్ల బైఫర్‌కేషన్‌ను పట్టించుకోలేదు. ఫలితంగా వారు పాత కార్యాలయాల్లోనే విధులు నిర్వహిస్తుండగా, నూతనంగా ఏర్పాటైన కార్యాలయాల్లో వాచ్‌మెన్లు, స్వీపర్లు లేక అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. నూతన కార్యాలయాల ఏర్పాటు తర్వాత ఉద్యోగుల విభజనకు 2018, జూన్‌లో సీజీఎం చైర్మన్‌గా ఎస్‌ఏఓగా కన్వీనర్‌గా, పూర్వ సర్కిల్‌ పరిధిలోని ఎస్‌ఈలు సభ్యులుగా కమిటీని నియమించి సర్కిల్‌ స్థాయిలో ఉద్యోగుల విభజన చేశారు. అదే విధంగా సీజీఎం చైర్మన్‌గా, డీఈ టెక్నికల్‌ కన్వీనర్‌గా ఎస్‌ఈలు సభ్యులుగా నియమించిన కమిటీ.. డివిజన్ల వారీగా ఉద్యోగులను సర్దుబాటు చేసింది. ఈ కమిటీలు ఇంజనీర్లు, ప్రొవెన్షియల్‌, ఆపరేషన్‌ అండ్‌ మెయింటెనెన్స్‌ సిబ్బందిని సర్కిళ్ల, డివిజన్ల వారీగా సర్దుబాటు చేశాయి. కానీ స్వీపర్‌, వాచ్‌మెన్లను ముట్టుకోలేదు. పూర్వ ఆదిలాబాద్‌, కరీంనగర్‌, ఖమ్మం, నిజామాబాద్‌ జిల్లాలో ఇంజనీర్లు, ప్రొవెన్షియల్‌, ఆపరేషన్‌ అండ్‌ మెయింటెనెన్స్‌, స్వీపర్‌, వాచ్‌మెన్‌, లైన్‌మెన్‌ డ్రైవర్లను సర్దుబాటు చేశారు. కానీ ఒక్క పూర్వ వరంగల్‌ సర్కిల్‌లో స్వీపర్‌, వాచ్‌మెన్‌, లైన్‌మెన్‌ డ్రైవర్‌ పోస్టులను పట్టించుకోకుండా వదిలేశారు. ఆ తర్వాత 2022 ఏప్రిల్‌లో సీజీఎం చైర్మన్‌గా, ఎస్‌ఈఓ కన్వీనర్‌గా, ఎస్‌ఈలు సభ్యులుగా సర్కిల్‌ స్థాయిలో స్వీపర్‌, వాచ్‌మెన్‌, లైన్‌మెన్‌ డ్రైవర్ల విభజన, సర్దుబాటు కోసం కమిటీ నియమించారు. అదే విధంగా డివిజన్‌ స్థాయిలో స్వీపర్‌, వాచ్‌మెన్‌, లైన్‌మెన్‌ డ్రైవర్‌ పోస్టుల విభజన, సర్దుబాటు కోసం సీజీఎం చైర్మన్‌గా, డీఈ (టెక్నికల్‌) కన్వీనర్‌గా, ఎస్‌ఈలు సభ్యులుగా మరో కమిటీని నియమించారు.

రెండేళ్ల గడిచినా ఎలాంటి నిర్ణయం లేదు..

ఈ కమిటీలను నియమించి రెండేళ్లు గడిచాయి. అయినా ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్వీపర్‌, వాచ్‌మెన్‌, లైన్‌మెన్‌ డ్రైవర్‌ పోస్టుల విభజన పట్ల నిర్లక్ష్యం చేస్తుండడంతో నూతనంగా ఏర్పాటైన కార్యాలయాల్లోని అధికారులు, ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అసౌకర్యానికి గురవుతున్నారు. సాధారణంగా ప్రతి ప్రభుత్వ శాఖ, ప్రభుత్వ రంగ సంస్థ కార్యాలయాలకు వాచ్‌మెన్లు ఉంటారు. అధికారులు, ఉద్యోగులు రాక ముందే స్వీపర్లు కార్యాలయాలను శుభ్రం చేస్తారు. అయితే కొత్తగా ఏర్పాటు చేసిన కార్యాలయాల్లో వాచ్‌మెన్‌, స్వీపర్‌ పోస్టులు మంజూరు, భర్తీ చేయకపోవడంతో రాత్రి కాపలా కాసే వారు కరువయ్యారు. కార్యాలయాల శుభ్రత గురించి వేరే చెప్పాల్సిన అవసరం లేదు. అధికారులు, ఉద్యోగులు సొంతంగా చందాలు పోగు చేసుకుని ప్రైవేటుగా స్వీపర్‌ను నియమించుకుని కార్యాలయాల్లో శుభ్రం చేయించుకుంటుండగా, మరికొన్ని కార్యాలయాల్లో సొంతంగా ఎవరికి వారు శుభ్రం చేసుకుంటున్నారు. రాష్ట్రంలో రెండు విద్యుత్‌ పంపిణీ సంస్థలుండగా ఇందులో టీజీ ఎన్పీడీసీఎల్‌ ఒక్కటి. ఇంత పెద్ద సంస్థలో వాచ్‌మెన్‌, స్వీపర్లను కార్యాలయాలకు నియమించకపోవడంపై అధికారులు, ఉద్యోగుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

వాచ్‌మెన్‌, స్వీపర్‌ పోస్టులను విస్మరించిన యాజమాన్యం

పూర్వ వరంగల్‌ జిల్లా (సర్కిల్‌) పరిధిలో టీజీ ఎన్పీడీసీఎల్‌ నూతనంగా నాలుగు సర్కిళ్లు ఏర్పాటు చేసింది. హనుమకొండ సర్కిల్‌ ఆఫీస్‌ పూర్వ కార్యాలయంగా, నోడల్‌ కార్యాలయంగా పని చేస్తుండగా, వరంగల్‌, జనగామ, మహబూబాబాద్‌తో పాటు జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా, ములుగు జిల్లా కలిపి భూపాలపల్లి సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. వీటితో పాటు డివిజన్‌ కార్యాలయాలు, సబ్‌ డివిజన్‌ కార్యాలయాలు కొత్తగా ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాలకు సబ్‌ ఇంజనీర్‌ స్థాయి నుంచి డివిజనల్‌ ఇంజనీర్‌ వరకు, జూనియర్‌ లైన్‌మెన్‌ నుంచి ఫోర్‌మెన్‌ వరకు, జూనియర్‌ అసిస్టెంట్‌ నుంచి సీనియర్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌ వరకు అధికారులు, ఉద్యోగుల బైఫర్‌కేషన్‌చేసి పోస్టులు మంజూరు చేసి భర్తీ చేసిన యాజమాన్యం.. వాచ్‌మెన్‌, స్వీపర్‌ పోస్టులను విస్మరించిందని అధికారులు, ఉద్యోగులు విమర్శిస్తున్నారు. వాచ్‌మెన్‌, స్వీపర్‌ బైఫర్‌కేషన్‌ కోసం సీజీఎం చైర్మన్‌గా కమిటీ వేసి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి ముందడుగు పడలేదు. దీంతో నూతనంగా ఏర్పాటైన కార్యాలయాల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా నూతన కార్యాలయాలకు స్వీపర్‌, వాచ్‌మెన్లను నియమించాలని అధికారులు, ఉద్యోగులు యాజమాన్యాన్ని కోరుతున్నారు.

వివిధ కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా

వివిధ కేసుల్లో నేరం నిరూపణ కావడంతో పలువురు నిందితులకు జడ్జిలు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ తీర్పులపై బాధిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి.



మహబూబాబాద్‌ రూరల్‌ : యువతి ఆత్మహత్య కేసులో నేరం నిరూపణకాబడిన ఓ యువకుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ మహబూబాబాద్‌ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్‌ గురువారం తీర్పు వెలువరించారు. టౌన్‌ సీఐ పెండ్యాల దేవేందర్‌ కథనం ప్రకారం.. మహబూబాబాద్‌లోని సిగ్నల్‌ కాలనీకి చెందిన మను బోతుల శిరీషను అదే ప్రాంతానికి చెందిన శ్యామల కార్తీక్‌ మాయమాటలు చెప్పి ప్రేమించి పెళ్లి చూసుకుంటానని మోసం చేశాడు. దీంతో ఆమె మనస్తాపానికి గురై 2017, డిసెంబర్‌ 24న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై శిరీష తల్లి యశోద మహబూబాబాద్‌ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై జి.నర్సయ్య కేసు నమోదు చేశారు. కొద్ది రోజుల అనంతరం అప్పటి ఆ కేసును మరో ఎస్సై చీర రమేశ్‌ బాబు విచారణ జరిపి కోర్టులో చార్జ్‌షీట్‌ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్‌ పక్షాన జిల్లా కోర్టు పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించగా కోర్టు డ్యూటీ ఆఫీసర్‌, పోలీసు కానిస్టేబుల్‌ భూక్య రవీందర్‌ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న జిల్లా జడ్జి పి.చంద్రశేఖరప్రసాద్‌ నేరం నిరూపణకాబడిన శ్యామల కార్తీక్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

పోక్సో కేసులో యువకుడికి రెండేళ్లు ..

వరంగల్‌ లీగల్‌ : 'నన్ను ప్రేమించాలి .. లేదంటే చంపేస్తా' అంటూ ఓ బాలికను బెదిరించిన ఘటనలో నేరం రుజువుకావడంతో నిందితుడికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు కోర్టు, పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.అపర్ణాదేవి గురువారం తీర్పు వెలువరించారు. అలాగే, బాధిత బాలికకు రూ.లక్ష పరిహారం చెల్లించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రాజమల్లారెడ్డి కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాలపూర్‌కు చెందిన మారెపల్లి అనురుధ్‌.. జనవరి 18, 2019న అదే గ్రామానికి చెందిన ఓ బాలిక ఇంటి వద్దకు వెళ్లి 'నన్ను ప్రేమించు.. లేదంటే నిన్ను, నీ కుటుంబీకులను చంపుతా'అంటూ బెదిరించాడు. ఈ విషయంపై మరుసటి రోజు సదరు బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు అనురుధ్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం న్యాయస్థానంలో నేరారోపణ పత్రం దాఖలు చేశారు. ఈ ఘటన జరిగిన ఎనిమిది నెలల అనంతరం ఆగస్టు 9, 2019న సదరు బాలిక తన ఇంటి వెనుక ఉన్న విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన అనిరుధ్‌.. బాలిక నోరు మూసి 'నన్ను ప్రేమించు.. లేదంటే చంపుతా' అని బెదిరించాడు. దీంతో బాలిక కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. బాధిత బాలిక ఫిర్యాదు మేరకు పోలీసులు అనిరుధ్‌పై మరో పోక్సో కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి న్యాయమూర్తి శిక్ష విధించారు. ఈ కేసులను అప్పటి ఎస్సై శ్రీధర్‌ దర్యాప్తు చేయగా, ప్రాసిక్యూషన్‌ తరఫున అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రాజమల్లారెడ్డి వాదించారు. సాక్షులను కానిస్టేబుల్‌ అంగోతు రవి కోర్టులో ప్రవేశపెట్టారు.

లైంగిక దాడి కేసులో వ్యక్తికి 20 ఏళ్లు..

వరంగల్‌ లీగల్‌ : బాలిక పై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి ఇరవై సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.3 వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు కోర్టు, పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.అపర్ణాదేవి గురువారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రాజమల్లారెడ్డి కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా కమలాపూర్‌ మండలం గునిపర్తి గ్రామానికి చెందిన ముత్యాల హన్మంతు ఇంటి ముందు ఆడుకుంటున్న బాలికను తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయంపై బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కమలాపూర్‌ పోలీసులు హన్మంతు పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయగా అప్పటి ఎల్కతుర్తి సీఐ కె.సతీష్‌చందర్‌రావు దర్యాప్తు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి అపర్ణాదేవి నిందితుడికి ఇరవై సంవత్సరాల జైలు శిక్ష, రూ. 3 వేల శిక్ష విధించారు. అలాగే బాధిత బాలికకు పరిహారం కింద రూ.లక్ష చెల్లించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ కేసును ప్రాసిక్యూషన్‌ తరఫున అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రాజమల్లారెడ్డి వాదించగా, భరోసా న్యాయసలహాదారులు సీహెచ్‌ నీరజ సాక్షులకు తర్ఫీదు ఇచ్చారు. కానిస్టేబుళ్లు హరీశ్‌, విక్రమ్‌ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

ఎన్‌సీసీ అకాడమీ ఏర్పాటుకు కృషి

- త్వరలో ముఖ్యమంత్రిని కలుస్తాం
- రెండు రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్‌ జనరల్‌ ఎయిర్‌ కమొడోర్‌ వి.ఎం.రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న వి.ఎం.రెడ్డి

కాజీపేట రూరల్‌: ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో ఎన్‌సీసీ అకాడమీ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్‌ జనరల్‌ ఎయిర్‌ కమొడోర్‌ వి.ఎం.రెడ్డి అన్నారు. వరంగల్‌ ఉమ్మడి జిల్లా ఎన్‌సీసీ ప్రధాన కార్యాలయ వార్షిక తనిఖీ నిమిత్తం వి.ఎం.రెడ్డి గురువారం హనుమకొండ బీఎస్‌ఎన్‌ఎల్‌ కార్యాలయ ప్రాంగణంలో గల ఎన్‌సీసీ ముఖ్య కార్యాలయానికి చేరుకున్నారు. ఇక్కడ వరంగల్‌ గ్రూప్‌ కమాండర్‌ కల్నల్‌ సచిన్‌ అన్నారావు నింబల్కర్‌, వీరచక్ర విన్నర్‌.. వి.ఎం. రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వి.ఎం. రెడ్డి ఎన్‌సీసీ కెడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించి కార్యాలయ పాలన, శిక్షణ విధానాలపై పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌లో పాల్గొన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వి.ఎం.రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఎన్‌సీసీ అకాడమీ ఏర్పాటు పెండింగ్‌ విషయాన్ని త్వరలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వివరించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో అకాడమీ ఏర్పాటైతే గ్రామీణ ప్రాంతాల వరకు ఎన్‌సీసీని విస్తరిస్తుందన్నారు. తద్వారా విద్యార్థులకు దేశ సేవ, ఉద్యోగావకాశాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 8 వేల మందికి పైగా ఎన్‌సీసీ కేడెట్స్‌ ఉన్నారన్నారు. కార్యక్రమంలో కల్నల్‌ సంజయ్‌ గుప్తా, అడిషనల్‌ డిప్యూటీ డైరెక్టర్‌ పీఅండ్‌సీ విభాగం ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ హెడ్‌ క్వార్టర్‌ సికింద్రాబాద్‌, జిల్లా ఎన్‌సీసీ ఏ.ఓ కల్నల్‌ పాల్‌ స్మయిల్‌, జిల్లా ట్రైనింగ్‌ అధికారి కల్నల్‌ రియాజ్‌, గ్రూప్‌ హెడ్‌క్వార్టర్‌ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ వై.కవిత, వరంగల్‌, ఖమ్మం యూనిట్ల వివిధ బెటాలియన్ల అధికారులు, సివిల్‌ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు మార్కెట్‌ విలువ

- ప్రజాభిప్రాయ సేకరణకు జూలై 1 నుంచి గ్రీవెన్స్‌
- రిజిస్ట్రార్‌ హరికోట్ల రవి



మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్‌ హరికోట్ల రవి

కాజీపేట అర్బన్‌ : నిబంధనల మేరకు భూమి మార్కెట్‌ విలువ నిర్ధారించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేయాలని జిల్లా రిజిస్ట్రార్‌ హరికోట్ల రవి తెలిపారు. కాజీపేట వంద ఫీట్ల రోడ్డులోని వరంగల్‌ ఆర్వో రిజిస్ట్రేషన్‌ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని 13 మంది సబ్‌ రిజిస్ట్రార్లకు ఆయన పలు సూచనలు చేసి మాట్లాడారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయ పరిధిలో ప్రభుత్వం అందజేసిన మార్కెట్‌ విలువ గైడ్‌లైన్స్‌ రూల్స్‌ 1998 ప్రాతిపదికన భూమి మార్కెట్‌ విలువను, రిజిస్ట్రేషన్ల నిర్ధారణ ప్రక్రియను ఈనెల 23వ తేదీ వరకు నిర్వహించాలన్నారు. ఆ నివేదికను ఈ నెల 29వ తేదీ వరకు అడిషనల్‌ కలెక్టర్‌, రిజిస్ట్రేషన్‌ శాఖ అధికారులు, ఆర్డీఓ, రెవెన్యూ, మున్సిపల్‌ అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీకి అందజేయాలన్నారు. కాగా, ఈనెల 29వ తేదీన కమిటీ నిర్ధారణ చేస్తుందని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణకు గాను జూలై 1 నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ifrr.gov.in అనే వెబ్‌సైట్‌లో ప్రత్యేక గ్రీవెన్స్‌ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జూలై 24వ తేదీన మార్కెట్‌ విలువలను కమిటీ అప్రూవల్‌ చేసి, జూలై 31వ తేదీన రిజిస్ట్రేషన్‌ శాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచి ఆగస్టు 1వ తేదీ నుంచి మారిన మార్కెట్‌ విలువలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్‌ జిల్లా సబ్‌ రిజిస్ట్రార్లు తదితరులు పాల్గొన్నారు.

పింగిళి కళాశాల పీజీ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న రిజిస్ట్రార్‌ మల్లారెడ్డి, కంట్రోలర్‌ ఆఫ్‌ ఎగ్జామినేషన్‌ నర్సింహాచారి

హన్మకొండ అర్బన్‌ : నగరంలోని పింగిళి మహిళా ప్రభుత్వ కళాశాల పీజీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్‌ పరీక్షల ఫలితాలను కేయూ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ మల్లారెడ్డి, కంట్రోలర్‌ ఆఫ్‌ ఎగ్జామినేషన్‌ ప్రొఫెసర్‌ నర్సింహాచారి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌ మల్లారెడ్డి మాట్లాడుతూ కేయూ పరిధిలో గల ఏకైక మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాల పింగిళి కళాశాల ఉన్నత స్థాయికి రావాలని, దీనికి అవసరమైన అన్ని రకాల సహకారాలు అందిస్తామని తెలిపారు. పేద, మధ్య తరగతి పిల్లలు అభివృద్ధిలోకి రావడానికి పింగిళి కళాశాల ప్రిన్సిపాల్‌, అధ్యాపకులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పీజీ మొదటి సెమిస్టర్‌ అన్ని కోర్సులలో 172 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరుకాగా 147 మంది ఉత్తీర్ణులై 85.47 ఉత్తీర్ణత శాతం నమోదైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ చంద్రమౌళి, కళాశాల పరీక్షల నియంత్రణాధికారి రామకృష్ణారెడ్డి, అదనపు కంట్రోలర్లు రేణుక, శిరీష, అధ్యాపకులు సుహాసిని, పార్వతి, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

నేల అనుకూల పంటల సాగు లాభదాయకం

- శాస్త్రవేత్త బి.రాములు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాములు

హన్మకొండ: నేల అనుకూల ఆధారిత పంటలు సాగు చేయడం లాభదాయకమని వరంగల్‌ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్‌ బి.రాములు అన్నారు. గురువారం వరంగల్‌ పైడిపల్లిలోని వరంగల్‌ వ్యవసాయ పరిశోధన స్థానంలో నాబార్డు సాయంతో నేల ఆరోగ్య యాజమాన్య పద్ధతులపై రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త బి.రాములు మాట్లాడుతూ సహజ వనరులైన నేల, వాతావరణం, నీరు క్రమక్రమంగా క్షయానికి గురవుతున్నాయని, ఇది రాబోయే తరాలకు అవసరమైన ఆహారపదార్థాల ఉత్పత్తి పై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే వివిధ పంటలకు అనుకూల నేలల్లో సాగు చేసినప్పుడే పూర్తి స్థాయిలో దిగుబడులు సాధించొచ్చన్నారు. ప్రధాన పంటలు వరి, పత్తి, మొక్కజొన్న, అపరాలకు అవసరమైన నేల, నీటి నాణ్యతపై సంపూర్ణ అవగాహన కల్పించారు. వరి పంటకు చౌడు, క్షారం, అమ్ల నేలలు తప్ప సాధారణంగా అన్ని రకాల నేలలు అనుకూలమన్నారు. పత్తి పంటకు లోతైన నల్ల రేగడి భూములు అనుకూలమన్నారు. మొక్కజొన్న పంటకు నీరు ఇంకే నల్ల రేగడి నేలలు, ఎర్ర నేలలు, ఒండ్రు కలిగిన ఇసుక నేలలు అనుకూలమన్నారు. అపరాలకు ఎర్ర చలక, నల్ల రేగడి నేలలు, మురుగు నీరు పారే వసతి కలిగిన నేలలు అనుకూలమన్నారు. కార్యక్రమంలో వరంగల్‌ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు ఆర్‌. ఉమారెడ్డి, వరి శాస్త్రవేత్త బి.సతీష్‌ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి జలాశయాలను రక్షించుకుందాం

- పర్యావరణ పరిరక్షకుడు కె.ప్రకాశ్‌



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రకాశ్‌, అతిథులు

హన్మకొండ: కాలుష్యం నుంచి జలాశయాలను రక్షించుకుందామని పర్యావరణ పరిరక్షకుడు కె.ప్రకాశ్‌ అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టర్‌ ఆఫ్‌ ప్యారిస్‌ విగ్రహాలను నిషేధిద్దామని, మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దామని కోరుతూ హనుమకొండ నుంచి హైదరాబాద్‌ వరకు కె.ప్రకాశ్‌ చేపట్టిన పాదయాత్ర గురువారం హనుమకొండలోని కాళోజీ విగ్రహం నుంచి ప్రారంభమైంది. ఈ యాత్ర స్టేషన్‌ఘన్‌పూర్‌ వరకు చేరుకుంది. ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్‌ ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.ప్రకాశ్‌ మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల్లో ప్లాస్టర్‌ ఆఫ్‌ ప్యారిస్‌ విగ్రహాలను స్వచ్ఛందంగా నిషేధిద్దామని, మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాల ప్రతినిధులు కె.అనితారెడ్డి, మండల పరశరాములు, శ్రావణ్‌ కుమార్‌, అనంత్‌, గోపాల్‌ రెడ్డి, సీమ రాజు, సురేష్‌ లాల్‌, కల్యాణ్‌ పాల్గొన్నారు.

పగలు కూలి పని.. రాత్రి బైక్‌ చోరీలు

- ఇద్దరు దొంగల అరెస్ట్‌
- 6 ద్విచక్రవాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరాం



దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న ఏసీపీ నందిరాంనాయక్‌, సీఐ మల్లయ్య

ఖిలా వరంగల్‌: పగలు కూలి పని చేస్తూ.. రాత్రి సమయాన ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్ట్‌ చేసి వారి నుంచి ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్‌ ఏసీపీ నందిరాంనాయక్‌ తెలిపారు. ఈ మేరకు మిల్స్‌కాలనీ పీఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ వివరాలు వెల్లడించారు. వరంగల్‌ రంగశాయిపేట తెలంగాణ కాలనీకి చెందిన జాగరి లికేశ్‌ , మంచిర్యాల జిల్లా దోరారిపల్లికి చెందిన జాగరి తేజ్‌ బంధువులు. వీరు పగలు కూలి పని చేస్తూ.. రాత్రి సమయాన ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్నారు. ఈ క్రమంలో గత నెల 24న రంగశాయిపేటకు చెందిన సుంకరి హర్షవర్ధన్‌, 25న రాత్రి ఎస్‌ఆర్‌ఆర్‌తోట చెందిన ఉరుగొండ సుభాష్‌, ఈనెల 12న రంగశాయిపేటకు చెందిన పేరాల సందీప్‌ బైక్‌లు అపహరించారు. ఈ ఘటనపై సందీప్‌ ఫిర్యాదు మేరకు బైక్‌ చోరీలపై ఏసీపీ స్పందించారు. ఇన్‌స్పెక్టర్‌ మల్లయ్య నేతృత్వంలో ప్రత్యేక ఐడీ పార్టీని ఏర్పాటు చేయగా.. సహదేవ్‌, బి.బాష్‌సింగ్‌, ఎండీ వాజీద్‌, సాంబయ్య టీమ్‌గా ఏర్పడ్డారు. సందీప్‌ బైక్‌ చోరీ చేస్తున్న సమయంలో నిక్షిప్తమైన సీసీ ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో లభించిన ఆధారాలను బట్టి జాగరి లికేశ్‌, జాగరి తేజ్‌గా గుర్తించారు. గురువారం వరంగల్‌ ఫోర్ట్‌రోడ్డుపై వీరిని అరెస్ట్‌ చేసి ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. కాగా, కాజీపేట, జమ్మికుంట పీఎస్‌ల పరిధిలో కూడా బైక్‌ చోరీలకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు ఏసీపీ చెప్పారు.

మిస్సింగ్‌ కేసులను ఛేదించిన పోలీసులు



యువతిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్‌ మల్లయ్య

ఖిలా వరంగల్‌: వరంగల్‌ మిల్స్‌కాలనీ పోలీస్‌ స్టేషన్‌లో నమోదైన నాలుగు మిస్సింగ్‌ కేసులను పోలీసులు ఛేదించారు. ఏసీపీ నందిరాంనాయక్‌ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్‌ మల్లయ్య నేతృత్వంలో పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి కేసులను ఛేదించారు. ఇటీవల వరంగల్‌ శివనగర్‌కు చెందిన గృహిణి నాటు రజిత, ఉర్సు కరీమాబాద్‌కు చెందిన కోదాటి రక్షిత, వరంగల్‌ శంభునిపేట ప్రాంతానికి చెందిన హబీబ్‌ ఉన్నీసా, దూపకుంట రోడ్డు శంభునిపేట గిరిప్రసాద్‌ నగర్‌కు చెందిన మంచాల మౌనిక అదృశ్యమయ్యారు. ఈమేరకు లోకేషన్‌ను ట్రేస్‌ చేసి మహిళతో పాటు ముగ్గురు యువతులను గుర్తించి తల్లిదండ్రులకు గురువారం అప్పగించారు. కేసులను ఛేదించిన ఇన్‌స్పెక్టర్‌ మల్లయ్య, సిబ్బందిని ఏసీపీ నందిరాం నాయక్‌ అభినందించారు.